క్లుప్తంగా

మురుగునీరు తొలగింపునకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: పాత కృష్ణ నగర్ పంచాయతీ ప్రాంతంలో గాంధీనగర్ వద్ద రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంపై ఇటీవల 'ఇళ్ల మధ్యలో మురుగునీరు.. పట్టించుకోరూ' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు ఆదివారం ఆ ప్రాంతంలో మురుగునీటిని పూర్తిగా మళ్లించడానికి అక్కడ ఉన్న కాలువలకు పూడిక తీశారు. మురుగునీరు వెళ్లిపోయిన తర్వాత ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు ఎంటీఎంసీ అధికారులు తెలిపారు.

నిత్యం ఇవే ఇబ్బందులు!



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి ప్రాతూరు నుంచి గుండిమెడ వెళ్లే రహదారిలో నిత్యం మురుగు నిలవడంతో అటుగా వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిలో తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మంగళగిరి రూరల్‌లోని నూతక్కి రామచంద్రాపురంతో పాటు దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల నుంచి ఈ రహదారిని ఉపయోగించి రాకపోకలు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డులో యూనివర్సిటీ, ఇతర కాలేజీల బస్సులు వేగంగా ప్రయాణించడంతో ఆ మురుగునీరు ద్విచక్ర వాహనచోదకులపై పడుతోందని, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



ఫిరంగిపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండల కేంద్రం కోనేరు కట్ట సమీపంలోని కొండపై భాగంలో శ్రీసాయిరాం స్టోన్ క్రషర్స్, గ్రీన్ వారియర్స్ బృంద సభ్యుల సహకారంతో బంతి విత్తనాలను ఆదివారం సాయంత్రం చల్లించారు. ఈ సందర్భంగా కొండవీడు అసిస్టెంట్ బీట్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత కాపాడటానికి క్రషర్ సిబ్బంది, వారియర్స్ బృంద సభ్యులు చేస్తున్న సేవలు పర్యావరణానికి దోహదపడతాయన్నారు. బంతి విత్తనాలు మొలిచి పచ్చని కొండలుగా మారతాయని ఆకాంక్షించారు. గ్రీన్ వారియర్స్ బృంద సభ్యులు కె.శౌరిఫ్రాన్సిస్, జున్నుసాహెబ్ మాట్లాడుతూ దాతల సహకారంతో ఇప్పటికే మర్రి, తుమ్మ, తురాయి, సీతాఫలం, రామాఫలం వంటి మొక్కలు నాటినట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి



మంగళగిరి టౌన్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. తాడేపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం రాత్రి రాష్ట్ర దివ్యాంగ విభాగ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన పులిపాటి దుర్గారెడ్డి.. దొంతిరెడ్డి వేమారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుర్గారెడ్డిని గుంటూరు జిల్లా దివ్యాంగ విభాగ అధ్యక్షులు బొక్కా అగస్టీన్, వేమారెడ్డి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

దాడి కేసు నమోదు

తెనాలిరూరల్: స్వల్ప విషయమై మహిళలపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన గోపి తన ఎదురింటిలో నివసించే బాలుడితో స్వల్ప విషయమై ఘర్షణ పడి కొట్టాడు. మధ్యలో అడ్డుకునేందుకు వెళ్లిన బాలుడి తల్లి, నాయనమ్మలపై సైతం దాడి చేసి గాయపర్చాడు. బాలుడి నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్ శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

ప్రచారంలో ప్రథమం.. ఆచరణలో అధమం

- మంగళగిరిలో స్వచ్ఛత సున్నా
- ఎక్కడ పడితే అక్కడే చెత్త
- పట్టించుకోని అధికారులు



టిడ్కో గృహ సముదాయంలోమురుగునీరు

మంగళగిరి టౌన్: అధికారుల మాటల్లో కనిపించే 'స్వచ్ఛత' చేతల్లో కానరావడం లేదు. ప్రచార ఆర్భాటాలేగానీ, ఆచరణలో అధమంగా కనిపిస్తోంది 'మంగళగిరి'. దేశంలో నంబర్‌వన్‌గా మంగళగిరిని తీర్చిదిద్దుతామన్న మంత్రి లోకేష్.. ఆ దిశగా అడుగులు పడటం లేదని గమనించాల్సి ఉంది. ఇటీవల స్వచ్ఛాంధ్ర అవార్డ్స్ 2025లో రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ మున్సిపాలిటీ విభాగంలో 1 నుంచి 3 లక్షల జనాభాలోపు ఉన్న మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ మొదటి ర్యాంకు సాధించిన విషయం విదితమే. అయితే ర్యాంకుల ఆర్భాటమే తప్ప 'స్వచ్ఛతాహీ' అంటూ మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చెత్త చెత్తగా..

మంగళగిరి నగర పరిధిలోని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్, ఆఫీస్ ఆఫ్ ది కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌తో పాటు పలు రాష్ట్ర కార్యాలయాలు ఒకే భవనంలో ఉన్నాయి. వీటితో పాటు ఎదురుగా అరణ్య భవన్‌లో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయాల పక్కనే చెత్త పేరుకుపోవడంతో అక్కడకు వచ్చే అధికారులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువైపుగా సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఏపీఐఐసీ, నిధి భవన్‌లతో పాటు పలు కంపెనీలకు ఉద్యోగాల నిమిత్తం వెళ్లేవారు సైతం ఇటుగా ప్రయాణించలేక పోతున్నామని వాపోతున్నారు. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. మంగళగిరి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద చెత్త పేరుకుపోయింది.



ఎలాంటి రక్షణ ఏర్పాటు లేకుండా చెత్తను తరలిస్తున్న వాహనం

దుర్వాసన

మార్కెట్‌లోని వ్యర్థాలను టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే ప్రధాన రహదారి వద్ద వేయడంతో అటుగా ప్రయాణించే వారు దుర్వాసన వెదజల్లుతోందని చెబుతున్నారు. కొన్ని రోజులుగా వాహనంలో ఉన్న చెత్తను కూడా తీయలేదని, పందులు, కుక్కలు, ఆవులు అక్కడకు చేరుకుంటున్నాయని, దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు పేరుకే పరిమితమయ్యాయని విమర్శిస్తున్నారు.



హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద వ్యర్థాలు

పెరుగుతున్న దోమలు

టిడ్కో గృహ సముదాయంలో ఎ11 బ్లాక్ వద్ద కొంతకాలంగా మురుగునీరు నిలిచిదుర్వాసన వస్తోందని, దీంతో దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు తెలుపుతున్నారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వచ్చే అవకాశముందని ఈ ప్రాంతాల వాసులు ఆందోళన చెందుతున్నారు. సాయంత్రం 6 దాటితే చాలు... టిడ్కో గృహ సముదాయంలో దోమలతో అవస్థలు పడుతున్నామని వ్యాఖ్యానిస్తున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చెత్తను తరలించే వాహనాలపై రక్షణ లేకుండా తీసుకెళ్తున్నారని దీంతో గాలికి వాహనచోదకులపై ఆ చెత్త పడుతోందని అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా పేరుకున్న చెత్త

వీఆర్‌కు మంగళగిరి రూరల్ సీఐ

మంగళగిరిటౌన్: నార్త్ సబ్‌డివిజన్ పరిధిలోని మంగళగిరి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వై. శ్రీనివాసరావు శనివారం రాత్రి వీఆర్‌కు వెళ్లారు. హైకోర్టు ఉద్యోగి (డ్రైవర్) లక్ష్మీనారాయణపై దాడి చేసిన ఘటనలో ఇటీవల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. దాడి ఘటనలో కేసు నమోదు కావడంతో పాటు ఉన్నత న్యాయస్థానం సీరియస్ అయ్యింది. ఈ నేపథ్యంలో వై.శ్రీనివాసరావును వీఆర్‌కు పంపుతూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఆర్డీఏ కార్యాలయ ప్రారంభోత్సవానికి రైతులందరూ ఆహ్వానితులే

తాడికొండ: అమరావతిలో సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి అమరావతి రైతులందరూ ఆహ్వానితులేనని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం సీఎంకు ఢిల్లీ పర్యటన ఉండటంతో బహిరంగ సమావేశం ఉండదని ఆయన ప్రకటనలో తెలపడం.. రాజధాని రైతులు, జేఏసీలో చర్చనీయాంశంగా మారింది.

ట్రంప్ సుంకాల యుద్ధంపై ప్రభుత్వ మౌనం బాధాకరం

సదస్సులో సీపీఎం నేత కేబీ ప్రసాద్

తెనాలి: 'భారతదేశంపై ట్రంప్ సుంకాల యుద్ధం-ప్రభావం-పరిశీలన-ప్రత్యామ్నాయం' అనే అంశంపై స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సీపీఎం నాయకుడు పి.జోనేష్ అధ్యక్షత వహించారు. సీపీఎం తెనాలి పట్టణ కమిటీ కార్యదర్శి కేబీ ప్రసాద్ సదస్సును ప్రారంభించారు. గత ఆరునెలలుగా ట్రంప్ ఏకపక్షంగా దూకుడుగా వ్యవహరిస్తున్నా, దేశ సార్వభౌమత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినా భారత ప్రభుత్వం నిరసన తెలియజేయలేదన్నారు. దీంతో ట్రంప్ మరిన్ని రెచ్చగొట్టే చర్యలకు పూనుకొంటున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలతో మన వ్యవసాయం దెబ్బతినేలా ఉందన్నారు. పాడిపరిశ్రమ, టెక్స్‌టైల్, తోలు, ఆభరణాలు, ఆక్వా, మందుల పరిశ్రమలు కోలుకోలేని విధంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంతటి తీవ్ర సమస్యపై దేశంలోని రాజకీయ పార్టీలు స్పందించకపోవటం బాధాకరమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సీపీఎం చొరవ తీసుకుని సదస్సు నిర్వహించిందని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. న్యాయవాది వై.స్టాలిన్, పోస్టల్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, జి.వెంకట సుబ్బయ్య, షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కవులతో ప్రజల్లో చైతన్యం

మంగళగిరి టౌన్: సమాజంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కవులు ముందుంటారని, వారి పాత్ర ముఖ్యమైనదని తెలుగు, సినీ, బుల్లితెర రచయిత మౌనశ్రీ మల్లిక్ అన్నారు. మంగళగిరి పరిధిలోని రాయల్ బాంక్వెట్‌లో ఆదివారం గోలి మధు రచించిన రెండు కవితా సంపుటిల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక్ మాట్లాడుతూ గోలి మధు కవిత్వంలో ఫైర్ ఉంటుందని పేర్కొన్నారు. మధు రచించిన ఎదురీత పుస్తకాన్ని ఆంధ్రనాటక కళాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సాహితీ విమర్శకులు రాజా హుస్సేన్ మాట్లాడుతూ గోలి మధు కవిత్వంలో స్పష్టత సూటిగా కనిపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, మినీ కవితల రచయిత రావి రంగారావు, వీటీజేఎం అండ్ ఐఈటీఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దామర్ల వెంకట నరసింహారావు, పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు. తొలుత మంగళగిరి సాహితీ వేదిక కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

నేడు ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేత

మంగళగిరి టౌన్: కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు మంగళగిరి మండల పరిధిలోని నవులూరు గ్రామంలో ఉన్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అధికారులకు వినతిపత్రం అందజేయనున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9.30 గంటలకు నవులూరులోని ప్రభుత్వ పశువుల హాస్పిటల్ వద్దకు చేరుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు పాల్గొననున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు దుగ్గిరాలలో

దుగ్గిరాల: రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు తీస్తున్న కల్తీ మద్యాన్ని అరికట్టాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మంగళగిరి మండలం నవులూరులో ఎక్సైజ్ పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేస్తామని పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. మండల గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

తాడికొండలో..

తాడికొండ: రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఏరులై పారుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం తాడికొండలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అధ్యక్షులు వనమా బాల వజ్రబాబు (డైమండ్) ముఖ్య అతిథిగా హాజరై నిరసన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తారని పేర్కొన్నారు.

అమాత్యా.. హామీని నెరవేర్చండి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు 313 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు కూటమి అధికారంలోకి వస్తే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సాంబశివరావు, కార్మికులు నవనీతమ్మ, సుభాని, ఖాసిం, సువర్ణకుమారి, బాషా, సుబ్బారావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న కార్మిక నాయకులు

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలో లబ్ధిదారులను కలసి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 18 వేల మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఉన్నారని లోకేష్ తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఆయన ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చలేదని విమర్శించారు. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నారని, సొంత ఇంటి స్థలం లేక అద్దెలతో ఆర్థికంగా ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాన్ని మంజూరు చేసి గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో మంగళగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు పల్లెకృష్ణ, షేక్ పాపా సాహెబ్, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

ఎన్నికల ముందు కూటమి నాయకులు పేద ప్రజలకు రెండు సెంట్ల స్థలాన్ని ఇస్తామని వాగ్దానం చేశారని, దాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని రామయ్య కాలనీలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల నుంచి అర్జీల స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు వేణు, మల్లీశ్వరి, వేముల దుర్గారావు,లక్ష్మి, గోపి, భాను తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ఈనెల 17వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థకార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పేదలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరినగర పరిధిలోని ఆంజనేయ కాలనీలో ఆదివారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పెట్టించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, వై. కమలాకర్, బాలాజీ, శ్రీనివాసరావు, రామారావు, హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నేతాజీ

యథేచ్ఛగా వరాహాల విహారం



మంగళగిరి మార్కెట్ వద్ద కూరగాయలు తింటున్న వరాహాలు



కనకదుర్గ వారధి కింద ఆర్అండ్‌బీ స్థలంలో పెంచుతున్న పందులు



మంగళగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట సంచరిస్తున్న వరాహాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పడినా ఈ ప్రాంతంలో వరాహాల బెడద తప్పడం లేదు. కొంతమంది పెంపకందారులు పందులను రోడ్డుపై వదిలివేస్తుంటే, మరి కొంతమంది ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని వీటిని పెంచి ఆ చుట్టు పక్కల ప్రాంతాలను అపరిశుభ్రం చేస్తున్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని మార్కెట్, కొత్తపేట, టిడ్కో గృహ సముదాయంతో పాటు పలు శివారుప్రాంతాల్లో, యర్రబాలెంలో, నవులూరు, నిడమర్రు, ఆత్మకూరు తదితర ప్రాంతాలతో పాటు తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, క్రిస్టియన్‌పేట, సీతానగరం, ఆర్ఎంఎస్ కాలనీ, కృష్ణనగర్ ప్రాంతాల్లో పందులు విపరీతంగా తిరుగుతున్నాయి. పగలు ఈ వరాహాలు ఎక్కడోచోట తలదాచుకుని రాత్రి అయితే రోడ్డుపక్కనే ఉన్న చెత్తకుండీల వద్దకు చేరి నానా బీభత్సం సృష్టిస్తున్నాయి.

నివాసాల్లోకి వస్తున్నాయి

కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో తిరుగుతూ ప్రజలు ఏర్పాటు చేసుకునే ప్రహరీల వంటి తడిగలను పడగొట్టి నివాసాలో వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎంఎస్ కాలనీలో, పాత రైల్వే క్వార్టర్స్‌లో వరాహాలు నివాసాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పంటపొలాల్లోకి, నివాసాల్లోకి పగలు రాత్రి తేడా లేకుండా చొరబడుతున్నాయి. మంగళగిరి పట్టణ పరిధిలో పాత మార్కెట్, కొత్త మార్కెట్ ప్రాంతాల్లో రోడ్డుపై పారబోసిన కూరగాయలను తినేందుకు ఈ వరాహాలు వస్తూ వాహనచోదకులు, స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మంగళగిరి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద రాత్రి సమయంలో రోడ్డుకు ఇరువైపులా పందులు పరుగులు తీస్తుండటంతో అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తూ వాటిని ఢీకొనడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. యర్రబాలెంలో కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకుని పందుల పెంపకం చేస్తున్నారు. ఇవి అంబటినగర్‌తో పాటు గరువు ప్రాంతం, చెరువు ప్రాంతాల్లో, శ్మశానాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. యర్రబాలెం శ్మశాన వాటికలో కర్మకాండలు నిర్వహించిన చోటచేరి అక్కడ పెట్టిన పదార్థాలను పాడు చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి కనకదుర్గ వారధి కింద ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి సిమెంట్ కట్టడం కట్టి పందుల పెంపకాన్ని నిర్వహిస్తున్నారు. ఇదే ప్రాంతంలో హోటళ్ల నుంచి సేకరించిన మిగిలిన ఆహార పదార్థాలను డంప్ చేసి వేరే ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఉదయం సమయంలో వాకింగ్ చేసేవారు, కృష్ణా తీరంలో ఉన్న శివాలయానికి వెళ్లే వారు ఈ ప్రాంతానికి రాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



వరాహాల కోసం కుళ్లిన ఆహార పదార్థాలను తీసుకువచ్చిన నిర్వాహకులు

కార్మికుల బకాయిలు చెల్లించండి

తాడేపల్లి రూరల్: నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను అధికారులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల విస్తృత సమావేశాన్ని తోట కృష్ణకుమారి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గుడ్లు ఉడకబెట్టినందుకు, జావ కాచినందుకు అదనంగా డబ్బులు ఇస్తామని అక్షయపాత్ర వారు చెప్పారని, ఇప్పటిదాకా కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా దుర్గారావు, అధ్యక్షురాలిగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా కృష్ణకుమారి, కోశాధికారిగా సలోమిని, మరో 10 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మికులు మరియమ్మ, బాలకోటమ్మ, శేషుకుమారి, రత్నకుమారి, ఫ్రాన్సిస్, షాహిన, రాజేశ్వరి, సామ్రాజ్యం, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు

చేబ్రోలు: జీవితంలో ప్రతి సారి బయటకి మార్పు కనిపించకపోయినా, మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు అని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్వ డీన్, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ కుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 'వరల్డ్ మెంటల్ హెల్త్ డే – 2025' వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని 'హీలింగ్ మైండ్స్' అనే థీమ్‌తో నిర్వహించారు. వెంకటేష్ కుమార్ మాట్లాడుతూ మానవ మేధ మూడు స్థాయిలలో పనిచేస్తుందని స్పృహ, ఉపస్పృహ, అవచేతన ఈ స్థాయిలను అర్థం చేసుకున్నప్పుడు భావోద్వేగాలను నియంత్రించే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. మార్పులను గుర్తించగల దృష్టి కలిగి ఉండాలని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఘటనలకు కృతజ్ఞత తెలిపే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో 90 శాతం విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో ఇరుక్కుపోయి సమయాన్ని, ఆరోగ్యాన్ని, ఆలోచనలను వృథా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.